క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం బాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రెండు రోజుల క్రితం ఒంగోలులో జరిగిన ఈ పోటీల్లో 8, 9 తరగతుల విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించగా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన వీరిని ప్రిన్సిపాల్ గంగాకుమారి సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని ఎంతో గొప్ప ప్రతిభ కనబరిచారని, వీరిని ఇతర విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.

అనిట్స్‌లో విజ్ఞాన సదస్సు



విజ్ఞాన సదస్సులో పాల్గొన్న నిపుణులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాలలో సోమవారం దవడ ఎముక జాయింట్‌కు సంబంధించి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ కుంటే వరుణ్ మాట్లాడుతూ ఆధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలను ఉపయోగించే పద్ధతులపై వివరించారు. సదస్సుకు ఏపీ, తెలంగాణలోని వివిధ దంత వైద్య కళాశాలలకు చెందిన 250 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో అనిల్ నీరుకొండ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డీజే భరత్‌రెడ్డి, సీఈవో నిరంజన్‌కుమార్, విభాగాధిపతులు డాక్టర్ బదరీ రామకృష్ణ, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్య, వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలు పరిశీలిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో పాలిఫెస్ట్ 2కే 23 పేరుతో నిర్వహించిన యువజనోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలు ప్రారంభించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక, సాంకేతిక ప్రదర్శనలు దోహదపడతాయని చెప్పారు. ఆలోచనే పెట్టుబడిగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ విభాగాలకు చెందిన 146 నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ ఎల్.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీ జీరుపేటకు చెందిన జీరు గురమ్మ (71) అనే వృద్ధురాలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించింది. ఈమె మనవడు రాజు భీమిలి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం... ఈ నెల 29న గురమ్మ పొయ్యి వద్ద ఉండగా ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి కాలిపోవడంతో 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. భీమిలి హెడ్‌కానిస్టేబుల్ టీపీ వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం



డైట్‌లో నివాళులర్పిస్తున్న ఛాత్రోపాధ్యాయులు, సిబ్బంది



చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆనందపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఆనందపురం : అహింసా మార్గంలో స్వాతంత్య్రాన్ని సాధించిన మహాత్మాగాంధీ మార్గం అందరికీ అనుసరణీయమని ఆనందపురం హైస్కూల్ హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు అన్నారు. హైస్కూల్‌లో జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కుప్ప రాజేశేఖర్, ఉపాధ్యక్షుడు ముడసల శ్రీను, కుప్ప రాము, ఉపాధ్యాయులు, కె.రామకృష్ణ పట్నాయిక్, రాజీవ్ నిర్మల కుమారి, చంద్రమతి, దేవి భవాని, రజియాబేగం పాల్గొన్నారు.

- స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీడీవో అడపా లవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఆంజనేయులు, మండల ఇంజినీరు వెంకటేశ్వరరావు నివాళులర్పించారు.
- మండలంలోని వెల్లంకి హైస్కూల్‌లో శ్రీశుభ బలరామ్ చారిటబుల్ సేవా ట్రస్ట్ చైర్మన్ ప్రసాదరావు పట్నాయిక్, హెచ్‌ఎం ఎస్.డి.బాబులాల్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమునిపట్నం: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా భీమిలి బీచ్ వద్దనున్న ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎర్నింటి అచ్చిబాబు, వాసుపల్లి ఎల్లాజీరావు, బాకి రమణారెడ్డి, చెల్లూరి గౌరినాయుడు, బోని సంజీవరావు, వాడమొదల జగ్గారావు, కుంకుపూడి ఎర్రిబాబు నివాళులర్పించారు.

- జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి ఛాత్రోపాధ్యాయులు నివాళులర్పించారు, అధ్యాపకులు త్రినాథరావు, అల్లావుద్దీన్, హరిణి, మాధవి పాల్గొన్నారు. నెహ్రూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.రాధ, ఈవోఆర్డీ ఎం.ఉషారాణి, ఏఈ సుధాకర్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ: చంద్రంపాలెం బాపూజీ కళామందిరం వద్ద జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం చేసి ఆయన సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా లక్ష్మణ, పిళ్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, కుడితి రామారావు, పిళ్లా అప్పన్న పాల్గొన్నారు.

- మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు పీహెచ్‌సీ, స్వతంత్రనగర్‌లో గల జాతిపిత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లెప్రసీ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు ప్రశాంతి, దీపికలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు ఎన్.సూర్యప్రకాశరావు, వంటాకుల శ్రీనివాసరావు, బాబ్జి, డాక్టర్ బీఎస్ రావు, కావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పీఎంపాలెం ఇన్‌స్పెక్టర్ ఎన్ని.రామకృష్ణను పౌర సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు, అధికారులు



ఆనందపురం హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పీఎంపాలెం సీఐ రామకృష్ణను సత్కరిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు



భీమిలి బీచ్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యూపీహెచ్‌సీ పరిసరాలు శుభ్రం చేయించాలి

మధురవాడ: స్వతంత్రనగర్ యూపీహెచ్‌సీ పరిసరాలు రాళ్లు, రప్పలతో నిండి ఉన్నాయని, వెంటనే శుభ్రం చేయించాలని మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు కోరారు. జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో వారు ఈ మేరకు జెడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్సీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జోన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి 7 అర్జీలు వచ్చాయి. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు, ఏఎస్ఆర్ పార్కును సుందరంగా తయారు చేయించాలని సంఘ అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాశరావు, కార్యవర్గ సభ్యులు తాతపూడి ప్రదీప్ కుమార్, బెల్లాపు పాపారావు, సుందరరావు, పోలిశెట్టి నాగేశ్వరరావు, పోలిశెట్టి జగన్మోహనరావు, తోట ఆశా స్వరూప్, సతీష్ తదితరులు కోరారు. సాగర్‌నగర్ ఎల్ఐజీ కాలనీలో బీటీ రోడ్డు కనెక్టివిటీ ఏర్పాటు చేయాలని స్వరూప్, సందీప్ కోరారు. సాగర్‌నగర్ గుడ్లవానిపాలెంలో వుడా కేటాయించిన ఇళ్ల కాంపౌండ్ వాల్ వద్ద అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గతంలో ఫిర్యాదులు ఇచ్చినా స్పందన లేదని జీవీవీ రాజు ఆరోపించారు. పీఎం పాలెం లాస్ట్ బస్టాప్ పోల్ నంబర్. 54/బి/3 పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లు ఏర్పాటు, సాగర్‌నగర్‌లో అంతర్గత డ్రైనేజీ సమస్యపై కె.సీతారామ స్వామి ఫిర్యాదు చేశారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

అతి వేగంతోనే ప్రమాదాలు



అంబేడ్కర్ కూడలిలో అవగాహన కలిగిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి

తగరపువలస: భీమిలి ట్రాఫిక్ ఎస్ఐ చింతలపూడి చిరంజీవి ట్రాఫిక్ సమస్యలపై సోమవారం సాయంత్రం అంబేడ్కర్ కూడలిలో ఆటో కార్మికులకు అవగాహన కలిగించారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లో తరలించవద్దన్నారు. అతివేగం ప్రాణాలకు ప్రమాదకరమన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించి ప్రభుత్వానికి, ప్రజలకు సహకరించాలని కోరారు. వాహనాలకు సంబంధించి పొల్యూషన్, బీమా, రిజిస్ట్రేషన్ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

జంతు హింస నేరం



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న కన్నయ్యనాయుడు

ఆనందపురం : జంతువులను హింసించడం నేరమని శొంఠ్యాం పశువైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎల్.కన్నంనాయుడు అన్నారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం శొంఠ్యాం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులను కొట్టడం, రాళ్లు రువ్వడం, ఇరుకైన వాహనాల్లో తరలించడం చేయరాదన్నారు. అలా చేస్తే చట్టపరంగా శిక్షలు పడతాయని వివరించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ తేజ, సహాయకులు బి.పోలారావు, ఎ.మోహన్ సాయి, పాఠశాల హెచ్‌ఎం కె.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస పశువైద్యశాల ఆధ్వర్యంలో కాపులుప్పాడలోని శ్రీప్రకాష్ స్కూల్‌లో జంతు సంరక్షణ చట్టాలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కలిగించారు. వైద్యుడు దినేష్ కుమార్ మాట్లాడుతూ జంతువులను గాయపరచడం, హింసించడం చేయరాదన్నారు. అధిక పాల ఉత్పత్తి కోసం హానికరమైన హార్మోన్ ఇంజక్షన్లు ఇవ్వడం నేరమన్నారు. పశువులను రోడ్లపై విడిచిపెట్టకుండా యజమానులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో క్రైం డొనెస్ క్లబ్ ఏర్పాటు చేశారు.

గోతుల రోడ్డుతో ప్రయాణికులకు ఇక్కట్లు



గుల మజ్జి వారి కళ్లాల వద్ద గోతులు పడిన రోడ్డు

పద్మనాభం: మండలంలోని పాట్నూరు పంచాయతీ గులమజ్జి వారి కళ్లాల రోడ్డు శిథిలమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాట్నూరు గ్రామ ప్రవేశం నుంచి గులమజ్జి వారి కళ్లాల వరకు కిలోమీటరున్నర నిడివి గల ఈ రోడ్డు పూర్తిగా గోతులమయం అయ్యింది. ఈ రోడ్డుపై గులమజ్జి వారి కళ్లాలు, పాట్నూరు, విజయనగరం జిల్లా జామి మండలం కుమరాం ప్రాంతాల వారు రాకపోకలు సాగిస్తుంటారు. మండలంలో పలు గ్రామాల వారు ఈ రోడ్డుపై కుమరాం వెళ్తుంటారు. రోడ్డుపై గోతులు పడడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి

పద్మనాభం: చిరుధాన్యాలను ఆరగించడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. చిరు ధాన్యాలు సంవత్సరం – 2023 సందర్భంగా మండలంలోని విలాస్కాన్‌పాలెంలో రైతులకు సోమవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాలు వాడడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ తగ్గుతాయన్నారు. మధుమేహం, స్థూలకాయం, ఆస్తమా, రొమ్ము క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. రైతులంతా చిరు ధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. రైతులు పండించిన చిరు ధాన్యాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ముందుగా చిరు ధాన్యాల అవశ్యకతపై పద్మనాభంలో విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీడీ మోహనరావు, శాస్త్రవేత్త త్రివేణి, ఏడీఏలు సీహెచ్ సుబ్రహ్మణ్యం, బి.విజయప్రసాద్, ఏవో ఎం.వి.ఎస్.చలం, సర్పంచ్ నల్లి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, వైఎస్సార్ సీపీ నాయకులు మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

విస్తృతంగా పందుల ఏరివేత



పందుల ఏరివేతను పర్యవేక్షిస్తున్న అధికారులు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్- 2లోని బోయిపాలెం, సాగర్ నగర్, ఆరిలోవ ప్రాంతాల్లో పందుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, జీవీఎంసీ వెటర్నరీ ఆఫీసర్ కిషోర్ తెలిపారు. జోన్‌లోని 5, 6, 7, 8, 12వ వార్డుల్లోని మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ, పీఎంపాలెం ప్రాంతాల్లో సోమవారం 300 పందులను షూటర్స్ కాల్చి చంపారు. గత కొద్ది రోజులుగా పెంపకందారుల నుంచి ఆటంకాలు ఎదురవుతుండడంతో పీఎం పాలెం పోలీసుల రక్షణలో నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు కేసులు నమోదు చేసినట్టు కిషోర్ చెప్పారు. ఈ డ్రైవ్ ఇంకా కొనసాగుతుందన్నారు. పోలీసులతోపాటు జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


భీమిలి మండల పరిషత్ సమావేశం నేడు

తగరపువలస: భీమిలి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతుందని ఎంపీడీవో పి.వెంకటరమణ తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఒక ప్రకటనలో కోరారు.

యువ పరిశోధకులతో నూతన ఆవిష్కరణలు

కొమ్మాది: యువ పరిశోధకులు ప్రాథమిక పరిశోధనలపై దృష్టి సారించాలని, నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం రసాయనిక విభాగం మాజీ అధిపతి ఇందిరా ప్రియదర్శిని సూచించారు. గీతంలో రసాయన శాస్త్రం విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాబా అణుశక్తి పరిశోధన కేంద్రంలో జరుగుతున్న అధ్యయనాలను ఆమె వివరించారు.

తైక్వాండో విజేతలకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు

మధురవాడ: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడ యూత్ తైక్వాండోకి చెందిన పలువురు క్రీడాకారులు పతకాల పంట పండించారు. యలమంచిలిలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో 38 బంగారు, 16 వెండి, 5 కాంస్య పతకాలు గెలిచారు.

ఈ నేపథ్యంలో మధురవాడలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో విజేతలను జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎం.అచ్చంనాయుడు, యూత్ తైక్వాండో సెక్రటరీ ఎమ్.సురేష్, కోచ్‌లు సుకుమార్, సంపత్, నవీన్ తదితరులు అభినందించారు. పలు విభాగాల్లో క్రీడాకారులు పతకాలు గెలుచుకున్నట్టు నిర్వాహకులు చెప్పారు.

చీటీల పేరుతో రూ.3 కోట్లకు టోపీ



బంగ్లామెట్టపై దాకమర్రి మంగ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టపై చీటీల నిర్వహణ పేరుతో దాకమర్రి మంగ అనే మహిళ రూ.3 కోట్లతో ఉడాయించినట్టు బాధితులు ఆమె ఇంటి ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే... మూడేళ్లుగా మంగ బంగ్లామెట్టపై చిరు వ్యాపారులు, కూలీలు, పండ్ల వ్యాపారుల నుంచి చీటీలు, అప్పులు, వరలక్ష్మి చీటీలు, పప్పుల చీటీల పేరుతో వసూళ్లకు పాల్పడి గడువు ముగిసినా ఎవరికీ చెల్లింపులు చేయలేదు. ఆరు మాసాలుగా ఆమె ఇంట్లో భర్త రామారావు, ఇద్దరు పిల్లలను వదిలి గాజువాక తదితర ప్రాంతాల్లో తలదాచుకున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై మూడు నెలల క్రితం బాధితులు భీమిలి పోలీసులను ఆశ్రయిస్తే మీరే మాట్లాడుకుని తేల్చుకోవాలని చెప్పి పంపించారు. మంగ భర్త రామారావు మాత్రం తన భార్య ఎవరి వద్ద ఎంత అప్పులు చేసిందో తనకు ఖచ్చితంగా తెలియదని, తాను తాపీ పనులకు వెళ్లిపోయేవాడినని అంటున్నాడు. ఇటీవల బాధితుల నుంచి సేకరించిన లెక్కల ప్రకారం రూ.30 లక్షలు ఉంటుందని, తన భార్య వచ్చిన తర్వాత ఇల్లు, స్థలం అమ్మి అప్పులు తీర్చేలా చూస్తానని బాధితులకు నచ్చచెప్పాడు.

ఇద్దరు విలేకరులపై కేసు నమోదు

పీఎం పాలెం: బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న అభియోగంపై ఇద్దరు విలేకరులపై సోమవారం కేసు నమోదు చేశామని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపారు. మారికవలస ప్రభుత్వ గురుకుల పాఠశాలకు సమీపంలో ఓ దివ్యాంగుడు నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఇందుకు జీవీఎంసీ నుంచి సరైన అనుమతులు లేవంటూ ఇద్దరు విలేకరులు ఆ దివ్యాంగుడిని ఫోనులో బెదిరించారు.

ఆ మాటలను బాధితుడు ఫోనులో రికార్డు చేసి నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో సీపీ ఆదేశాల మేరకు ఆ ఇద్దరు విలేకరులను గుర్తించి వారిపై కేసు నమోదు చేశామని సీఐ రామకృష్ణ తెలిపారు.

జీవ వైవిధ్యంపై అవగాహన అవసరం



సదస్సుకు హాజరైన భీమిలి ప్రజాప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం జీవ వైవిధ్య కమిటీ సభ్యులు, కార్యదర్శులతో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా కార్యక్రమ సమన్వయకర్త జానకీరావు, గ్రామ వికాస సమితి అధ్యక్షుడు జి.వి.ఎస్.తిరుపతయ్య జీవ వైవిధ్యం విశిష్టతను ప్రజాప్రతినిధులు, సభ్యులకు వివరించారు. పర్యావరణ కాలుష్యం కారణంగా భూమిపై జీవ వైవిధ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని పరిరక్షించుకోవడానికి ప్రకృతి వ్యవసాయం పెంచి రసాయనాల వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. అడవులు, ఉద్యానవనాలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో కేపీ బాలామణి, సర్పంచ్‌లు కాద సూర్యనారాయణ, గాడు వెంకటనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలపార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, బోని సన్నిబాబు, అక్కరమాని అప్పలనాయుడు, బొగ్గ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు గైర్హాజరుపై న్యాయమూర్తి ఆగ్రహం

పీఎం పాలెం: ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు కోర్టుకు హాజరుకాకపోవడంపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని ముద్దాయిగా ప్రకటించి అరెస్ట్ చేయాలని పీఎం పాలెం పోలీసులను అనకాపల్లి అడిషనల్ అసిస్టెంట్ జడ్జి ఆదేశించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధి రేవళ్లపాలెంకు చెందిన ఆరంగి అప్పారావు(39) మద్యానికి బానిసయ్యాడు. ఇంటి వద్దనే ఉంటూ భార్య, పిల్లలను వేధించి హింసించేవాడు. ఇంట్లోని సామగ్రి చిందరవందర చేసేవాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం ముద్దాయిగా ప్రకటిస్తూ అరెస్టు చేయాలని పోలీసులను సోమవారం ఆదేశించింది. అప్పారావు సమాచారం తెలిస్తే 9440796060, 0891 272133కు తెలియజేయాలని సీఐ కోరారు.

విద్యుత్ లైన్‌కు దూరంగా ఇళ్లు నిర్మించుకోవాలి

పద్మనాభం: విద్యుత్ లైన్‌కు ఐదు అడుగుల దూరంలో ఇళ్లు నిర్మించుకోవాలని ఆ శాఖ ఏఈ జగన్‌మోహన్‌రావు సోమవారం సూచించారు. ఐదు అడుగుల కన్నా తక్కువ దూరంలో ఇళ్లు నిర్మించుకున్నాక విద్యుత్ ప్రమాదాలు జరిగితే తమ శాఖకు సంబంధం లేదని తెలిపారు. ఐదు అడుగుల లోపల ఉన్న విద్యుత్ వైర్లను జరిపించుకోవాలన్నారు. ఇందుకోసం డీడీ తీసి తమకు ఇస్తే 15 రోజుల్లోగా ప్రమాదకరమైన వైర్లను తమ సిబ్బంది పక్కకు జరుపుతారని తెలిపారు.